# దర్యాప్తు

రంగారాజుపురం వొక మేజరు పంచాయితీబోర్డు గల వొక చిన్న పట్నం. అది తాలూకా హెడ్ క్వార్టర్సు. అక్కడున్న పెద్దాఫీసరు డిప్యూటీ తాసీల్దారు. అతగాడిని నిజంగా డీటీ (Deity=దేవత) లాగే ముఖ్యంగా భయంతోనూ, కొంత భక్తితోనూ చూస్తారు. ఆతరవాత పోలీసు సబిన్స్పెక్టరు. అతడిచేతులో వజ్రాయుధం వుంటుంది కాబట్టి భయంతోనే చూస్తారు. ఆతరవాత పంచాయితీ బోర్డు యెగ్జిక్యూటివాఫీసరు. అతణ్ణి ముఖ్యంగా వర్తకులు భయభక్తులతో చూస్తారు హైస్కూలుంది హెడ్మాస్టరుకి పైని చెప్పిన ఆఫసర్లందరికంటే యెక్కువ జీతం వొస్తుంది. కాని అతణ్ణి ఆ వూరివారు ఆఫీసర్ల లెక్కలో చేర్చలేదు. ఇతర మేష్టర్ల సైటకు చెప్పనక్కర్లేదు.

వొకనాడు సాయంకాలం నాలుగ్గంటలకి సబిన్స్పెక్టరుగారు టీ, టిఫినూ సేవించి సిగరెట్టు కాలుస్తూ స్టేషనులో కూచున్నారు. అప్పుడు వోపాత్తి పంచలపండా, నీలమణిపాణిగ్రాహి అనేవాడు యేడుస్తూవొచ్చి, 'బాబూ! యినస్ప్రెటో బాబూ! మాది నూరూ రూపయా దొంగ సేసేరుబాబూ' అంటూ ఆయనకాళ్లమీద పడ్డాడు. సబిన్స్పెక్టరు, 'ఏయ్! ఏమీటి గోలా? నిల్చుని చెప్పూ' అంటే 'నూరూ రూపయా పోయిందీ, మహప్రో (మహాప్రభో)! 'అయితే నన్నేం జెయ్యమంటావ్?! 'అది కాదూ కాబూ. దొంగసేసేరూ.' 'దొంగతనమా? ఏయ్! నాలుగొందల తొంభై! నా డైరీ తీసుకురా.' డైరీ తెచ్చేక ఎస్సైనీలమణితో, 'నీ పేరూ?' 'నీలమొణిపాణిగ్రాహి' 'సాకీనూ - ఏవూరు?' 'పొదంపురో.' 'ఎక్కడుంది?' 'బ్రొమ్మపురు దగ్రా వుంది.' 'నీవృత్తి?' 'పాత్తీ, పట్టా పంచా వోర్తకం.' 'ఈవూరెప్పుడొచ్చావు?' 'రెండు నెలా అయింది.' "నీబసయెక్కడ?" "అదెయ్యసెట్టీ యింటికాడా." "ఇంటికాడేమిటి? వాళ్లింట్లోనా?" 'లేదూ బాబూ. ఆడియాది అరుగులో కొట్టువుంది. దానీలో వున్నాం." "నువ్వొక్కడివేనా, యింకెవళ్ళైనా వున్నారా?" "వొక్కడే బాబూ." "అయితే యేం జరిగిందో చెప్పు." "సిత్తం. నిన్న వుదయం స్నానో సేసి మూటా పట్కొని యెదురుపాడూ, అప్పలపేంటా యెల్లినాం. అక్కడ మాకు డబ్బుయియ్యాల. అది వొసూలుసేసి గంటకిముందు యిక్కడికొచ్చేం. కొట్టులోనికెల్లిసూస్తే మాదీ పెట్టె పగిలివుందీ. అదీలో నూరురూపయాలూ లేదూ మహప్రో"అని యేడుపారంభించేడు. "ఏయ్ షటప్. గాడిదలాగ వొంగ్రపెడతావేమిటే? నేనడిగిందానికి జవాబు చెప్పు. నీ కెవళ్ళమీదేనా అనుమానం వుందా?" "వుంది బాబూ. అదెయ్యసెట్టికొడుకూ వరాలుసెట్టె దొంగసేసేడుబాబూ" "జాగ్రత్తగా మాట్లాడు. ఆదెయ్యసెటి లక్షాధికారి. అతడికొడుకు నీడబ్బు దొంగిలించేడంటావు. నిదర్శనాలేమిటి?"

## పి. జి. స్వామి

"ఆడికీ ఆదెయ్యసెట్టి పైసా కూడా యియ్యడు బాబూ. ఆడుకల్లు తింతాడు (తాగతాడు), సిగ్రేటు తాగుతాడు, అయ్యరు కబ్బులో తింతాడు ఆడికి బాకీ పడినాడు. వూర్లో అందర్కీ బాకీ"

"అయితే?"

"యా బైరూపయా బదుల్ యిస్తావా అని మాకు అడిగినాడు.' యియ్యాల మా సావుకారుకి రెండునూర్లు పంపాలా. యింకో నూరూపయా తేవాలా. మేం యివ్వలేమని చెప్పేం."

"నీ పెట్టెలో నూరురూపాలున్నాయని అతడికెలాగ తెలిసిందీ?"

"మేం సెప్పేం కాదు బాబూ. వొక నూరు వుందీ, మరొక నూరు వొసూలు సేసి తేవాలా అని."

"నువ్వు గ్రామాలకి వెళ్ళినప్పుడు ఆ డబ్బు నీతో యెందుకు తీసుకుపోలేదూ?"

"దొంగా బయం బాబూ."

"కొట్టుకి కప్పతాళం వేసేవా?"

"యేసేం"

"పెట్టెకి?"

"అదీకీ యేసేం బాబూ."

"నువ్వు తిరిగి వొచ్చేసరికి కొట్టికి వేసిన తాళం బద్దలుగొట్టివుందా, తీసివుందా, వేసివుందా?"

"యేసివుందీ. తాళం తిప్పితే కష్టంగా తిరిగింది."

"లోపలి కెళ్లి చూస్తే నీ పెట్టె తీసివుందీ?"

"అవును బాబూ."

"అందులో రూపాయిలు కాక యింకేమైనా వున్నాయా?"

"మాదీ పాణీగావంచా మూడూ. మా తంబుడూగొదాధొరోవి నాలుగూ. చొయితొన్యాగిత్తో (చైతన్య స్వామి కీర్తనల పుస్తకం) వొకటీ. మాదీ రొంధాతబలా (వంటగిన్నెలు) రెండూ వున్నాయి."

"మీ తమ్ముడెక్కడున్నాడు?"

"బ్రొమ్మపురో యెల్లినాడు"

"ఎప్పుడెళ్లేడు? ఎందు కెళ్లేడు?"

"నాలుగురోజు ముందు. ఆడికీ కుంతుర్ఘా (కూతురు) జొన్మొ (జన్మ) అయిందీ. సూసివొస్తానని కెల్లినాడు."

"ఏయ్ పండా! నువ్వు గొప్పవాళ్లమీద రిపోర్టిచ్చేవు. అది అబద్ధమైతే కేసంతా నీమీద తిరిగి నీకే శిక్షవుతుంది. సరే నువ్వు వెళ్ళి నీ కొట్టుదగ్గరుండు. మేం దర్యాప్తుకు వొస్తాం" అని అతణ్ణి పంపించి, "నాలుగొందల తొంభై! మాడూ వరాలు సెట్టి మన పి. సి. (Potential Criminals) రోలులో వున్నాడేమో. మూడు వొంకులు ఆ పేరుంటుందిలే వాడు తాగుబోతు కాబట్టి ఎప్పటికేనా మన చేతులో చిక్కుతాడని యెక్కించేవుంటాను" P.C.490, ఆ రోలు చూసి "వుంది సార్" అన్నాడు. "అయితే మరింకేం. హెచ్. సీ. అరస్టై నాలుగూ చుప్పూ (చేతివాచీ చూసి), యిప్పుడు ఫోర్టర్తి అయింది. సిక్సుకల్లా తయారుగా వుండండి. సెట్టి యింటికి వెళ్దాం. ఇది నేను జీ. డీ.లో నోటు చేస్తాను. ఎఫ్. ఐ. ఆర్. తయారుచెయ్యి. హెచ్. సీ.తో చెప్పు" అని జి. డి. లో వ్రాసుకున్నాడు.

సర్కారు జిల్లాలలో, ముఖ్యంగా శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాలలో, బరంపురమూ, ఆ చుట్టుపక్కల వున్న గ్రామాలనుంచీ వొరియా బ్రాహ్మణులు, పాత్తి పంచలూ, పట్టు బట్టలూ, తెచ్చి రొక్కానికీ, అరువుకీ అమ్మటం మామూలు. వాళ్లు సాధారణంగా, వొకవూళ్లో స్థిరంగా వుండేవాళ్ళకే అరువులిచ్చి మరుచటి సంవత్సరం వొచ్చి బాకీలు వసూలు చేసుకుంటూ వుంటారు. వుద్యోగస్తులక్కూడా యిస్తారు.

# ★ దర్యాప్తు ★

వొకవేళ బదిలీ అయితే, కొబ్బూరీవాళ్ళలాగ, వాళ్ళ యిండ్రుసులు కనుక్కొని హాజరవుతారు. నీలమణి పాణిగ్రాహి అటివాడే. వాళ్ళ సాధారణ నామధేయం 'పొత్తి పండల పండాలు.'

సాయంకాలం ఆరున్నరగంట లవుతుంది. ఎస్సైని, హెచ్. సీ (సింగు), పీ సీ నాలుగొందల తొంభై, ఆదెయ్యసెట్టి ఇంటి ముందు సైకిళ్లుదిగి, సెట్టిని కేకేశారు. అతడు బయటికొచ్చి 'దండాలు, దండాలు దొరసెయ్యాలి,' అని గజగజ కొట్టుకుంటున్న గుండెల్తో, లోపలికి తీసుకెళ్లి, హాలులో కూచోబెట్టేడు. 'యిన్యాల మామీ దింత కటాచ్చం వొచ్చిం దదికొర్లకి' అన్నాడు.

ఎస్సై: ఏయ్, నాలుగొందల తొంభై! ఏగి నా డైరీ, ఫిర్యాదీ యిచ్చిన స్టేటుమెంటున్నా?

సెట్టి: ఏరియా దేటి బాబూ?

ఎ: ఏమీ లేదు. మీవీధి కొట్లో వున్న నీలమణి పాణిగ్రాహి అనే ఆసామి తన పెట్టెలో నూరురూపాయలు పెట్టి వుంచి నన్నా, అందులో యాభై రూపాయలు బాకీలిమ్మని మీ కుమారుడు వరాలుసెట్టి అడిగినట్టున్నా, అతడు యివ్వ నిరాకరించి, కొట్టుకీ, పెట్టెకీ, తాళాలు వేసి నిన్న వుదయం దగ్గర గ్రామాలకు బాకీలు వసూలు కొరకు వెళ్ళి, తిరిగీ యీ సాయంకాలం మూడుగంటలకి వొచ్చి చూడగా తన పెట్టె పగలగొట్టబడినట్టున్నా, అందులోని నూరు రూపాయిలు (కొన్ని నోటు, కొన్ని రూపాయిలు), చోరీ కాబడ్డట్టున్నా, ఆపని మీ కుమారుడే చేసివుంటాడనిన్నీ, మాకు రిపోర్టు యిచ్చేడు.

సె: అబద్దాలు! పచ్చి అబద్దాలు! మా పిడుగోడు దొంగోడా? నమ్మకండి బాబూ. ఆడిముందు లచ్చరూపాయి లెడితే నూకైనా నూడ్డు. ఆడు పండాగోరి నూరు రూపాయిలు తీస్తాడా?

ఎ: సరే. దర్యాప్తుమీద అంతా తేల్తుంది. సింగూ! పద. నేరం జరిగినస్థలం చూదాం.

సిం: ఫింగర్ప్రింట యాపరేటసుకూడా తెచ్చేను సార్.

ఎ: వెరీగుడ్. అదీ వుపయోగించుదాం.

వాళ్ళిద్దరూ కలిసి ముందుగా వీధి వరండాలో వున్న కొట్టుదగ్గర కెళ్లేరు. వెనక నించి పీ. సీ. వెళ్తున్నాడు. అప్పుడు సెట్టి 'కనిస్టేబుగారూ! అదేటి? పింగరిపింటన్నారు?' 'అదా? ఎవరైనా, ఏ వొస్తువైనా ముట్టుకుంటే వాళ్ల వేలు ముద్రలా వొస్తువుమీద పడతాయి వాటిని సరిగ్గా పొటోగ్రాపు తీస్తుందా యంత్రం.' 'సచ్చాంరా సుగుడా! మా పిడుగోడు రోజూ పండాగారితో మాట్టాట్టాని కెల్తాడు.' 'వెళ్ళినంత మాత్రాన భయంలేదు. తీస్తే కదూ. ఎస్సైగారు పిలుస్తున్నారు' అని వెళ్లేడు. పండావున్న కొట్టు తాలూకు ప్లాను తయారుచేసి అందులో పెట్టెవున్న స్థలం మార్కు చేసి, కొట్టుకీ, పెట్టెకీ, వేసిన కప్పతాళాలు కాయితాలలో పొట్లాలుకట్టి పోలీసుపార్టీ వెళ్ళింతరవాత పండాకూడా తన పెట్టె పట్టుకుని మరో పండావున్న బసకి పోయేడు. స్టేషను కెళ్ళింతరవాత పీ. సీ. 'సార్! సెట్టి గాభరాగా వున్నాడు. పింగర్ప్రింటంటే యేమిటని అడిగితే చెప్పేను. మరీ గాభరాపడ్డాడు.' హెచ్.సీ. "మనదగ్గిర నిజంగా ఆ యాపరేటసుండి యేడిసిందా యేమిటి. అదో కిస్తా వేసేను. బాగా పారింది." ఎస్సై: "సింగూ! నువ్వు వరాలుసెట్టి యూ మెంటున్న వాచ్చెయ్యి కాఫీహోటలు అయ్యరుకీ, సిగరెట్టుషాపువాళ్ళకీ బాకీలు తీరుస్తాడో లేదో రేపటినుండీ కనిపెట్టు" అని చెప్పేడు.

నాలుగు రోజులైనతరవాత సింగువొచ్చి వరాలుసెట్టి తనకు వున్నవున్న బాకీలు చాలావరకూ తీర్చేడనీ, బ్లాక్ లిక్కరు షాపుకి రోజూ చీకటిపడగానే చంద్రశేఖరం అనే రౌడీతో హాజరవుతున్నాడనీ రిపోర్టిచ్చేడు. ఎస్సై: "ఇక దొరికేడు ఆదెయ్య. బ్లాకుమార్కెట్టులో దోచుకున్న కిలం కొంత వూడగొట్టాలి. రేపు వుదయం పదకొండు గంటలకి స్టేషనుకి హాజరవమని వరాలుసెట్టికి కబురంపు. అలా రాకపోతే యెరస్టు చేస్తామను." సింగు, "సరే. మరి ఆదెయ్యమాటో?" ఎస్సై, "చూస్తా వుండవోయ్."

మర్నాడు పదకొండు గంటలకి వరాలుసెట్టి, పట్టుడ్రెస్సు వేసుకుని స్టేషను కొచ్చేడు. అతణ్ణి చూడగానే ఎస్సై "రండి సెట్టిగారూ. వోయ్ నూట ముప్పైయారూ! సెట్టిగారి కుర్చీ వెయ్యి." సెట్టి కూచున్న తరవాత,

ఎస్సై: ఏమిటండీ ఆ పండావాడు మీమీద రిపోర్టు చేసేడూ?

సెట్టి: అంతా అబద్ధం బాబూ. నా కొట్టుకి రెండు నెల్లద్దె బాకీవుంటే యిమ్మని అడిగితే ఆడి కోపమొచ్చింది. ఇదంతా అల్లినాడు.

ఎ: సరి దానికేమిలెండి. (జేబు తడుముతూ), సిగరెట్టుకేసు యింటిదగ్గిర మర్చిపోయేను. వోరీ రాములూ!

సె: (తన సిగరెట్టుకేసు తీసియిచ్చి) ఇప్పుడింటి కెందుకు బాబూ? యిందులో వున్నాయి. కాల్చండి.

ఎ: (వొకటి తీసి) అబ్బో! హైక్లాసే అలవాటు చేసేరే. మీ రెంతవరకూ చదువుకున్నారు?

సె: పస్టుఫారం సదివేను. పెద్దజబ్బు సేస్తే మాయమ్మ నాకు సదు వచ్చిరాదని యిస్కూలు మానిపించింది.

ఎ: చదువు లేకపోతే మీకు లోపమేమిటండీ. మీకు పెళ్లైందా?

సె: అయింది.

ఎ: భార్యా వొచ్చిందా?

సె: ఏటి రావడం. యింకా మూడేళ్ళ మాట.

ఎ: అయితేమాత్రం. మీ రూరుకున్నారా యేమిటి. నాకు తెలిసిందిలెండి.

సె: (కుషీగా చిరునవ్వుతో) తమలాటోరు అలాటివి యినకూడదు సినోళ్ళు సినోళ్ళేగదా బాబూ.

ఎ: అయితే మీకు డబ్బెలాగ వొస్తుంది వీటన్నిటికీని?

సె: మా నాయనిస్తాడు. మా యమ్మ కూడా యిస్తుంది.

ఎ: సరే మీరు వెళ్ళండి. ఎక్కడి కెళ్తారిప్పుడు?

సె: మా నేస్తం, చంద్రసేకరంకాడికి.
(సెట్టి వెళ్ళేడు)

ఎ: సింగూ! చంద్రశేఖరమంటే, ఆ డ్రాంకర్డూ, రౌడీనీ కదూ?


సకల దంత వ్యాధులకు

కోతిమార్కు
నల్లపండ్లపొడి



ప్రతిచోట
దొరకును.

నోగి అండ్ కో
87 చైనాబజార్‌రోడ్, మద్రాసు-1

బెజవాడ సాక్షిస్టులు: ట్రేడ్ ప్రమోటింగు కార్పరేషన్, పోస్టుబాక్సు నెం. 80 గాంధీనగరం.

సి: అవును సార్. కాని వీణ్ణి సుళువుగా విడిచీసేరే.

ఎ: ఏ డెందుకోయ్. ఆదెయ్యని అర్జంటుగా రమ్మన్నానని నిల్చున్న పాటుని లాక్కురా.

సి: యెస్సార్.

ఆదెయ్యసెట్టిరాగానే మర్యాదాచేసి కూచోబెట్టి.

ఎ: వోరే రాములూ! సెట్టిగారికి వో సోడాబుడ్డీ, కిల్లీ తీసుకునిరా. (అర్ధం తరవాత) సెట్టిగారూ! సిగరెట్టు కాలుస్తారా? (అని తన సిగరెట్టుకేసు తీస్తూవుంటే)

సెట్టి: వొద్దు బాబూ. అలవాటు లేదు.

ఎ: అయితే సెటిగారూ! మీవాడికి అంత సెబ్బు కర్చుకెందుకిస్తారూ? చిన్నవాళ్ళకి చేతులో డబ్బుంటే చెడిపోరూ?

సె: రామా! రామా! మా వరాలు కేయలవాట్లూ లేవు బాబూ నాకుమాత్రం తెల్దా. అడికి వో పైసాయయినా యియ్యను. ఆళ్ళమ్మకూడా అంతే.

ఎ: అలాగన్నారు నాకు సంతోషం. అలా వుంచితేనేగాని మీరు కష్టపడి పోగుచేసిన డబ్బంతా మూడురోజుల్లో యెగిరిపోతుంది.

సె: అవును బాబూ. అంచేతే అడికొక్కవల్సిన టిపే నింటికాడే, యేవో, సక్కిడేలూ, సెవుడేలూ, జంచుట్లూ, ఆళ్ళమ్మ యిస్తుంది.

ఎ: సరే. ఆ పండావాణ్ణింకా మీ యింట్లో వుంచేరా యేమిటి?

సె: ఆ డప్పుడే యెల్లేడు.

ఎ: సరే. మీరు వెళ్ళండి. వాడి రిపోర్టేదో ఫైసల్చెయ్యాలి. మళ్ళీ కబురుచేస్తే రండి.

సె: సిత్తం. తమరి దయ. యేదో తమకి సంతోషం సేస్తాను.

ఎ: ఆ! నాకేమీ వొద్దండీ. నా డ్యూటీ నేను చేసుకుపోతాను.

సె: తమరు దరమరాజులు, (అంటూ వెళ్లేడు.)

సింగు: సార్! సెట్టితో యీ హాస్యంతా యెందుకూ?

ఎ: మనకొక్కవలసిన పాయింటు లాగేం కదోయ్.

సి: ఏమిటా పాయింటు?

ఎ: వాడు తన కొడుక్కి, తనుగానీ, తన పెళ్ళాంగానీ, వొక దమ్మిడీయైనా యివ్వడం మామూలు లేదని చెప్పేడా? మరి వరాలుకి తాగుడుకీ, కాఫీక్లబ్బుకీ, సిగరెట్లకీ, వుంపుడుకత్తెకీ డబ్బెలాగొస్తున్నాది. వాణ్ణి పీ. సీ. రోలులో మనం వుత్తినే వెయ్యలేదు. అవునుగాని, ఆ పండావాణ్ణి పిలిపించూ. మనింట్లో రేపు కార్యంవుంది. రెండు పట్టుచాపులూ, రెండు చీరలూ, వో పట్టు షర్టింగు తానూ కావాలి.

సి: డబ్బుపోయి వాడేడుస్తూవుంటే యివన్నీ పైపెచ్చు వాడికి పైనా?

ఎ: ఇదొక లెక్కటోయ్. త్రీ యియర్సు కిందట, అయితంపూడిలో వో లక్షాధికారింట్లో హౌసు బ్రేకింగ్ ఎండ్ తెఫ్టు కేసులో చోరీ ఆస్తి అంతా వో కేడీ దగ్గిర దొరికిపోతే యేమైందో తెలుసా. పెద్దపులికి డబుల్ కాసుల పేరూ, చిరుతపులికి వొడ్డాణమూ, వరదుకి నాలుగు పేటల గొలుసూ, గుంటవక్కలన్నిటికీ తలోచిన్న వొస్తువా, కేడీ గాడికి రెండు జతల గాజులూ సర్దేసి, ఆ వెధవని ఓ. వీ. (Out of view) అయిపోమన్నారు. పైపెచ్చు చోరీపోయిన వాడి కొడుకు ముండలముఠాకోరనీ, తాగుబోతనీ, వాడే చోరీ చేసేడనీ, అంచేత వాణ్ణి ముందు యరస్టుచేసి లాకప్‌లో వుంచాలంటే, అది తప్పించడానికి మరైదు వేలు రాలేయి. దాని ముందిదెంతోయ్.

నీలమణివొచ్చి ముందు ఎస్సై, పీ. సీ. 490 ని పిలిచి యిన్‌స్ట్రక్షన్లు యిచ్చేడు. నీలమణి వొచ్చేడు. రాగానే ఎస్సై "ఏయ్ నాలుగొందల తొంభై! యీ ఆసామీని లాకప్పులో వెయ్యి. ముందు బేడీ లుగిలించూ." అనీసరికి నీలమణి తెల్లబోయి, "మహాప్రభో! మా డబ్బూపోయిందీ మాకూ జెయిలా?" అంటే, "నీడబ్బు పోయిందా? దొంగమాటలు. నీడబ్బంతా నీ తమ్ముడిచేతి కిచ్చి మీవూరు పంపించి, మీదు మిక్కిలి వూళ్లో ఘరానా మనిషిమీద ఫాల్సు రిపోర్టిస్తావా? దీనికి శిక్షేమిటో తెలుసా? ఆర్నెల్లు జెయిలు. చూస్తావేమిటోయ్. బేడీలు వేసి లాకప్పులో వెయ్యి." అప్పుడు, పీ. సీ. పండాని వెనక వరాండాలోకి తీసుకెళ్లి, "పండాగారూ! మీ మంచికోసం చెబుతున్నాను వినండి. ఆఫీసరుగారింట్లో రేపు కార్యం. వారికి రెండు పట్టుచాపులూ, రెండుచీరలూ జరీవి, వొక పట్టు షర్టింగు తానూ అవసరం. అవితీసుకొచ్చి ప్రెజంటు చెయ్యండి. వాటికి తగిన ప్రతిఫలం ముట్టజెపుతారు. మీకు జెయిలుప్రాప్తి వుండదు. లేకపోతే యిబ్బంది తప్పదు."

పండా: యెంత గహచ్చారంరాబాబూ! తమరు చెప్పింది అంతా మూడు వొందలవుతాది. నూరురూపాయా పోయిందీ. యిదీ మూడూ. అంతా నాలుగొందలా, బాబూ?

పీ. సీ: మీ రింకా వెనకపాటే పాడుతున్నారు. నేం చెప్పినమాట వినండి. యిదుగో కాయితం. దీనిమీద వేలుముద్ర వెయ్యండి.

పం: అదీ యెందుకూ బాబూ?

పీ. సీ: మీరు యెవరిమీదా యెట్టి నేరమూ మోపలేదని. అదియిస్తే మీ రిచ్చిన కంప్లేంటు మాయెసలే చింపేస్తాం.

పండా అరేరాధేగోబిందో, అంటూ వేలుముద్ర వేసేడు.

నిజంగా ఆ కాగితం నీలమణి ఎస్సైగారికిచ్చిన పట్టుబట్టల ఖరీదు రెండువొందల యిరవైరూపాయిలు ముట్టినట్టు రశీదు అది తీసుకుని పీ. సీ. "మీరా బట్టలు రాత్రి తొమ్మిదిగంటలకి బాబుగారి బసలో యిచ్చియండి. రేపు వారింటి కార్యానికి రండి. అలా చెయ్యకపోతే రేపు మీరెక్కడున్నా బేడీల ప్రాప్తి తప్పదు." "చిత్తం, చిత్తం" అని పండా వెళ్లేడు.

ఆరాత్రి యేడుగంటలకి ఆదెయ్యసెట్టి యింట్లో సెట్టి, అతని భార్యా, కొడుకూ, కూచున్నారు. అప్పుడు సెట్టిభార్యా, "మనింటికాడికి పోలీసోళ్ళెందుకొచ్చినారు" "ఆ పండావోడి డబ్బు పోయింది గాదూ. అది మన సిగురోడే తీసేడని ఆడు పోలీసోళ్లకి రిపోటిచ్చేడు అది దరియాప్తు సెయ్యటానికొచ్చేరు." "ఒరి జిమ్మడా! ఆసితల పేలిపోనూ! సిగురోడు తీసేడని సెప్పేడా? గొల్లిపోయేడుగాని ఆడిమీద నిప్పులోసీద్దును. అయితే యేటయిందది? పోలీసోళ్ళేటన్నారు?" "ఆ! యేటంటారూ. సిగురోణ్ణి పిల్చేరు. ఆ తరవాత నన్ను పిల్చేరు. మరేద సేసేరు. ఆ పండావోడు సెప్పిందంతా అబద్ధం బాబూ అంటే అవునన్నారు. యెల్లండన్నారు. యింకేటి సేత్తారు. ఆదెయ్యసెట్టంటే యేటనుకున్నావ్.'

ఆ విధంగా సెట్టి చెబుతూవుండగా ఎస్సై, హెడ్. సీ, మరి యిద్దరు పీ. సీ లు వొచ్చేరు. వొక కానిస్టేబులు వొచ్చి 'సెట్టిగారున్నారా? యినస్పెక్టరుగారొచ్చారన్నాడు. సెట్టి కుటుంబమంతా తెల్లబోయేరు. సెట్టిలేచి వీధిలోకొచ్చి 'దండాలు, దండాలు దైసెయ్యాల' అని లోపలికి తీసుకెళ్ళి ముందు హాలులో కుర్చీలమీద కూచోబెట్టేడు. తనూ కొడుకూ చేతులు కట్టుకుని నిలబడివున్నారు. సెట్టి భార్యా, లోపలి గుమ్మంలో నిలుచుంది. అప్పుడు,

ఎ: సింగూ! ఆ నేరమూ, దాని కయ్యే శిక్షా, ఆ రెండింటి గురించీ చెప్పూ.

సిం: యెస్సార్! హౌస్ బ్రేకింగ్ అండ్ తెఫ్టు. అనగా మరియొకరి ఆధీనంలో వున్న యింటియొక్క గాని, కొట్టుయొక్క గాని తాళం బద్దలుగొట్టియైనా సరే, గోడకు కన్నం తవ్వియైనాసరే లోపలికి ప్రవేశించి, అందులోవున్న ఆస్తి చోరీ చేయడం. ఇది సెవన్సు కేసు. అనగా యీకేసు జిల్లా జడ్జీయే విచారణచేసి తీర్పు

# ★ దర్యాప్తు ★

చెప్పాలి. కిందవాళ్లకి పవరు లేదు. ఇందుకు శిక్ష, మూడు మొదలు, పది సంవత్సరముల వరకూ కరినశిక్షా, వేయి రూపాయీల వరకూ జుల్మానా.

సె: ఇదంతా యెందుకు బాబూ, సద వడం?

ఎ: ఎందుకా? నీ కొడుకు వరాలుసెట్టి, నీలమణి పాణిగ్రాహీ ఆధీనంలో వున్న కొట్టుతాళం బలవంతంగా తీసి, లోపల ప్రవేసించి, అతని పెట్టె పగలగొట్టి, అందులో వున్న నూరు రూపాయీలు చోరీ చేసేడు గనక.

లోపల్నించి సెట్టి భార్యా పెద్ద గోల చేస్తూ 'వోరయ్యల్లో! యెవుడు సెప్పేడు బాబూ ఆడి బుర్ర పేలిపోనూ, ఆణ్ణి అమ్మోరు మింగేనూ' అని అరవడ మారంభించేసరికి

ఎ: ఎవరా గోల?

సె: మా యింటిదాయి బాబూ.

ఎ: వూరుకోమనూ - లేకపోతే లాకప్పులో వేస్తాం.

సె: వోల్లకోయే! బాబుగారి కోపం వొస్తాది. బాబూ మావోడేటి యెరగడు. సెప్పుకోరా బాబుగారితోనూ.

వరాలు: నాకేటీ తెలీదు. నా నింట్లో లేను.

ఎ: నువ్వు బలే దర్జాగా ఖర్చుచేస్తున్నావే ఆ డబ్బెక్కడిది?

సె: ఆడు కర్చేటి బాబూ? చేతులో పైసాయైనా వుండదు.

ఎ: అదే నే ననేమాట. మీ వాడు హైక్లాసు సిగరెట్లు, పెట్టె పద్నాలుగణాలది, కొలుస్తాడు. రోజూ రెండుపూటలూ అయ్యారు హొటలుకెళ్ళి టిఫిను తింటాడు. ఇంకా నీకు తెలియకపోవచ్చునూ, తాగుతాడు, వొక అమ్మినికూడా వుంచేడు. వీటన్నిటికీ డబ్బెలా గొస్తున్నాదీ? ఏ దొంగతనమూ చెయ్యకపోతేనూ?"

ఈమాటలు వింటున్నంతసేపూ వరాలుసెట్టి వొణికిపోతున్నాడు. వొంటినిండా చెమట కమ్మింది. మొహమ్మాడిపోయింది. ఆదెయ్యకూడా వెర్రిచూపులతో కొడుకువేపు చూస్తూ నిలబడ్డాడు. అయినా లేని ధైర్యమూ, భీకరం తెచ్చుకుని, 'బాబూ! అంతా అబద్దం బాబూ గిట్టనోళ్లెవల్లో సెప్పుంటారు. మావోడలాటోడు కాడు బాబూ నమ్మకండి?

ఎ: వూరుకోవయ్యా (అని హెచ్. సీతో) సింగూ! ఇన్వెస్టిగేషను రిపోర్టు చదువూ.

సి: యెస్సార్. ఆగస్టు యిరవైనాలుగో తేదీ సాయంకాలం, అనగా చోరీ జరిగిన మర్నాటి సాయంకాలం వరాలుసెట్టి అనే ఆసామీ, నేతాజీకేఫ్ ప్రొప్రయిటరు గణపతి అయ్యరుకు బాకీవున్న నలభై యెనిమిది రూపాయీల మింజుమలె నలభై రూపాయీలు చెల్లించెను. సిగరెట్టు, కిళ్లీ, సోడాషాపు వోనరు వెంకటస్వామికి బాకీ యిరవైయారు రూపాయీలు మింజుమలె యిరవై రూపాయీలు జమకట్టెను. తరవాత చంద్రశేఖరం అనే రౌడీతో జాయింటుగా తమ ఆడాలో వుంచుకున్న నీలి అనే వ్యభిచారస్త్రీ యింటివద్ద సదరు




ఇండియన్ సోప్ & టాయిలెట్రీస్ మేకర్సు అసోసియేషన్ సభ్యులు

చంద్రశేఖరం, నీలీ, వరాలుసెట్టీ, వెరసి ముగ్గురు ఆసామీలూ, మరియిద్దరు రౌడీలతో కలిసి తాగి, జూదమాడినట్టు రిపోర్టు అంశములు.

ఇదంతా లోపల్నించి వింటున్న సెట్టి భార్యా, బుజమ్మీద బట్ట జారిపోడమైనా చూసుకోకుండా, మహాకాళీ స్వరూపం లాగ హాలులోకొచ్చి, సింగుని అనేక తిట్లు తిడుతూ, "యిదంతా పోలీసోళ్ళ మాయ. మన సిగురోడిమీద దన్నాయంగా సెప్పుతున్నారు. నువ్వు మొద్దులాగ సూత్తావోల్లకున్నావు. అళ్ళని బైటికి గెంటూ" అంటూ గోలచేస్తూవుంటే, ఎస్సై "ఏయ్ సింగూ! ముందుగా ఆ మనిషికి బేడీలు వెయ్యి. Obstrnctiug a public servant in the discharge of duty (ప్రభుత్వోద్యోగి తన కర్తవ్యం నిర్వహిస్తోంటే నిరోధించిన నేరం) కింద డైరీలో నోటు చెయ్యి." అనీసరికి ఆదెయ్య సెట్టి ముందుకొచ్చి "బాబూ తమ పాదాలొట్టుకుంటాం. క్షెమించాలి" అని బతిమాలి తన భార్యతో "వొల్లకోయే వొకటే గోలా. ఆరి కోపమొస్తే అందర్నీ కొట్లో యేస్తారూ." కొడుకుని చూసి "యేట్రా సచ్చేదవా! ఇంత పని సేస్తున్నావురా? అందుకే యీడికి డాకటేరు కోడ యింజీసాలూ" అంటే వరాలు, "మరంత సిన్నగుంటొద్దంటే యినకుండా శాక్కట్ట బెట్టేవు. మరేటవుతదీ." అంతటితో సెట్టి భార్యకూడా, "వోరి రొయదవపీనుగా! మా పానాలమీదికి తెచ్చేవురా"అంటూ లోపలికెళ్ళింది.

ఎస్సై లేస్తూ "సింగూ! నువ్వూ, ఆ యిద్దరు పీసీలూ కలిసి వరాలుసెట్టికీ, ఆదెయ్యసెట్టి భార్యాకీ బేడీలు వేసి లాకప్పులో వుంచండి. నేను సారిపిల్లి మర్డరు కేసులో యిన్వెస్టిగేషను ఫినిషు చేసుకురావాలి. రేపు మేస్ట్రీటు కోర్టులో వీళ్ళిద్దరిమీదా కంప్లెయింటు దాఖల్చేద్దాం." ఆ మాటలు వినీసరికి సెట్టి ప్రాణా లెగిరిపోయినంతపనైంది. "ఇంటిదాయేటి సేసిందిబాబూ" సింగు "పబ్లీకుఆఫీసర్లను తిట్టి, డ్యూటీ చెయ్యకుండా ఆటంకపరిచినందుకు. దీనికి శిక్ష ఆర్నెల్లఖైదూ, అయిదువొందలుజుల్మానా" అన్నాడు. ఎస్సై, "ఏమిటాలశ్యం? నేను పోవాలి" అని లేచి రెండడుగులు వేసేసరికి సెట్టివొచ్చి అతని చేతులుపట్టుకుని, "బాబూ! యివి సేతులు కావు. తమలాంటి ప్రభువులు కోప్పడితే మాలాటోళ్లం బతగ్గలమా? తమరే యేలాగో వోలాగ, దమించి రచ్చించాల. సింగుబాబుగారూ తమరు సెప్పండి"

సింగు: యేం జెప్పడమయ్యా. నేరం బాగా రుజువైంది. కేసు పెట్టగానే మేస్ట్రీటు చార్జిచేసి కమిట్మెంటు కట్టేస్తాడు. వీళ్లని రిమేండులో పెట్టేసియాలి. తరవాత యే ఆర్నెల్లకో జిల్లా జడ్జీకోర్టుకి యీ ముద్దాయీలని తీసుకెళ్లాలి. అక్కడ శిక్ష తప్పదు. డిల్లీకి వెళ్ళినా తిరుగుండదు. మా డూటీ ప్రకారం వీళ్ళిద్దర్నీ కొట్లో వెయ్యాలి. మీరుచేసే పనేదో చేసేస్తారు. మేం మా డూటీచేస్తే మమ్మల్ని తిడతారు. అంతా బాబుగారి కటాక్షం. (ఎస్సైతో) బాబూ! వీళ్లు ప్రాధేయపడుతున్నారు. తమ రాలోచించాలి.

ఎ: ఏమి టాలోచించడమోయ్? యీ కేసుతో నాకు సర్కిల్ పదవికి ప్రమోషను వొస్తుంది. నీకు ఎస్సై తప్పదు. యావజ్జీవితం వొచ్చే లాభం వొదులుకుంటావా? నువ్వే చెప్పూ.

సిం: తమరు శెలవిచ్చిందీ నిజమే. కాని పట్టూ విడుపూ వుండాలి. ఒకానొకప్పుడు మనకొచ్చే లాభంకూడా గడ్డిపరకలాగ విడిచిపెట్టి వుపకారం చెయ్యాలి. సెట్టిగారు అమాయకులూ, యిప్పటికి గౌరవంగా కాలక్షేపం చేస్తున్నారు. ఆయన్ని వీధిని పెట్టవొద్దని నామనవి.

ఎ: (నవ్వుతూ) సెట్టి అమాయకుడా? మా గొప్ప అమాయకుడు! బ్లాకు మార్కెట్టులో యెంతమంది నెత్తురు పీల్చో లక్షలార్జించి, యింత మేడ కట్టించి, మిల్లు నడిపిస్తున్నాడు.

సె: బాబూ! తమ రలాగ సెలవిస్తే యెలాగ? లాబాలొస్తే కోమిటోణ్ణిగదా, వొగ్గిడమెలాగ?

ఎ: అదే మేమనీ మాటాను. యెవడు మాత్రం తనకొచ్చే లాభం వొదులుకుంటాడోయ్,

సిం: ఇంతకీ తమ శెలవుకోసం సెట్టిగారు నిరీక్షిస్తున్నారు.

ఎ: నా శెలవేమిటీ. మూడు చేతులు కలిస్తేనేగాని యీ చిక్కు విడదియ్యడానికి వీల్లేదు. పైగా సెట్టిభార్యా నేరంకూడా డైరీలో నోటు చేసీసేం.

సె: (భయంతో) మూడుసేతు లేటి బాబూ?

ఎ: ఏమిటా?. నాపైవాడిచెయ్యీ, నా చెయ్యీ, మా స్టాఫ్ చెయ్యీ, యీ మూడూ కలిస్తేనేగాని యేమీ సర్దుబాటుకాదు.

సి: బాబుగారు న్యాయంగా శెలవిచ్చేరు.

సె: యేటిబాబూ! సింగుగారూ?

సింగు, "నేనుచెప్తానురండీ సెట్టిగారూ" అని లోపలికి తీసుకుపోయి కొంతసేపు మాట్లాడేడు. పైకి వొచ్చి ఎస్సైగార్ని కూడా లోపలికి తీసుకెళ్లేడు. వొక పావుగంటైంతరవాత సెట్టి "వో యింటిదానా! యినప్పెట్టి తాళాలేయే" అని కేకేస్తే ఆమె కూడా లోపలికి వెళ్లింది. మరి కొంతసేటికి సెట్టీ, సింగూ, ఎస్సై, హాలులోకొచ్చేరు. లోపల, "వోరయ్యల్లో! గోరం, గోరం" అని యేడుపు వినిపిస్తే సెట్టి అదమాయించేడు. సెట్టికి కళా కాంతీపోయింది. అసలే నల్లటివాడు. ఇప్పుడు మరీ బొగ్గులాగ మాడిపోయేడు. పోలీసాఫీసర్లిద్దరూ కుషీగా వున్నారు. వెళ్ళబోతూ ఎస్సై, సింగుతో, "మర్చిపోయేనూ. సెట్టిభార్యామాటో?" "నేను మరిచిపోలేదు బాబూ. రేపు తమ యింటిలో కార్యానికి సెట్టిగార్నీ, భార్యాగార్నీ, వరాలుసెట్టిగార్నీ దయచేయమని తమ తరఫున నేనే యిన్వైటు చేసేను. సెట్టిగారూ తప్పకుండా దైచెయ్యాలండీ," అంటేసెట్టి, "చిత్తం, చిత్తం. మర్చిపోతానా?" ఎస్సై, "సరే. సింగూ,! రేపు జ్ఞాపకంచెయ్యి, సెట్టిభార్యామీది నేరం నాడైరీలోంచి రద్దు చేసీదాం." అంటే యిద్దరూ నవ్వుకున్నారు. ఎస్సై "సెట్టిగారూ! గుడ్ నైట్. మిస్టరు వరాలూ, రేపు కలుద్దాం." అని తన ట్రూపుతో కూడా వెళ్లేడు. వాళ్లు వెళ్ళగానే సెట్టి, "ఓరి సచ్చేదవా! నీమూలాన్ని యినప్పెట్టిలోంచి మూ చేతులెగిరిపోయినారా. గోరం, గోరం" అంటూ బావురుమని యేడ్చేడు. అందులో సెట్టి భార్యాకూడా కలిసింది.

స్టేషనుకి వెళ్ళేం తరవాత యీ కేసు యిన్వెస్టిగేషనులో వొచ్చిన క్రెడిట్లో ఎస్సైకి రెండువొంతులూ, మిగిలిన వొంతు స్టాఫ్‌దీ అని నిర్ణయించుకున్నారు. అప్పుడు సింగు, "బాబూ! యీ కేసు క్లోజు చేసేదామా?" "ఉండవోయ్. ఆ పండాతమ్ముడు గదాధరుణ్ణి యెగ్జామిను చెయ్యడానికి బరంపురం వెళ్లొద్దూ. ఈ సందట్లో నే రెండేళ్ళ చూడలేదు. మా చెల్లెల్నీ, బావమరిదినీ చూస్తాను. నువ్వూ, నూట ముప్ఫైయారూ రండి." "సరే బాబూ. మా అత్తవారు కళ్ళికోటలో వున్నారుట. అలాగ వెళ్ళి చూడొచ్చు." "ఆ పీ.సీ. తల్లీ, అబ్బా, బరంపురంలో వున్నారుట. శెలవు పెట్టే బదులు అందరం డూటీమీదే వెళదాం." "అయితే బాబూ. కేసెలాగ డిస్పోజుచేస్తాం?" "ఏముందీ! స్టోలెన్ ప్రాపర్టీ కాయిన్సూ, కరన్సీ నోట్లూను. నాట్ ట్రేసబుల్ అని రిమార్కు రాసి క్లోజుచేస్తాం."

మర్నాడు ఎస్సైగారింట్లో కార్యానికి ఆదెయ్యసెట్టీ, కుటుంబం వొచ్చేరు. పెద్ద పళ్లెంనిండా కొబ్బరికాయలూ, పళ్ళూ, పసుపూ, కుంకుమా, జరీచీరా, చాపూ, తెచ్చేరు. తలో నూటపదహార్లూ కట్నం చదివించేరు (ఏడున్నూ నే). పండానికూడా పిలిచేరు. అతడూ వొచ్చేడు. వాళ్లందరికీ, స్టాఫ్‌కీ, పెద్ద విందు జరిగింది. ★